**కథ**

# ఈ కాలం పిల్లలు



—వేలూరు మునుస్వామి

'రాజారామ్ సార్ టాటా'!

'రాజేశ్వరీ మేడమ్ టాటా!'

స్కూటర్ ఇక కదులుతుందనగా ఉలిక్కిపడి తలెత్తారు రాజారామ్, రాజేశ్వరీ.

మేడ పైన చేతులూపుతున్నారు తమ సంతానం.

'ఒరేయ్ గోపీ! నీ పని చెప్తానుండు తిరిగొచ్చాక! ఏవే సాధనా నీకు ఒళ్లు బలిసిందే. మీ కెన్నిసార్లు చెప్పాను, అమ్మానాన్నలను పేర్లు పెట్టి పిలవకూడదని...!"

భార్య పళ్లుకొరుకుతుంటే ఆమెను శాంతపరుస్తున్నట్లుగా నవ్వేశాడు రాజారామ్, 'వాళ్లు చిన్నపిల్లలు రాజీ. వాళ్ల ముద్దు ముద్దు మాటలకు మనం ముచ్చటపడాలి. నీకు మరీ ముక్కు మీద వుంటుంది కోపం...' అంటూ.

'మీ వత్తాసు చూసుకునే వాళ్లలా పేట్రేగిపోతున్నారు, మీకేం మగమహారాజులు, ఇంటి ఊసే పట్టదు. చుట్టుపక్కల అమ్మలక్కల అవహేళనలు తట్టుకోలేకపోతున్నాను. అదిగో! ఆ కృష్ణవేణి అప్పుడే కిటికీ దగ్గర తయ్యారు, మన భాగోతం సినిమాలా చూస్తూ. మీరటు ఆఫీసుకు వెళ్లాక విసుర్లు విసుర్తుంది చూడు, బట్టి, చుప్పనాతి! మీరు పదండి..."

భర్త కొట్టినందుకు కాదు, తోడికోడలు నవ్వినందుకే బాధన్నట్లు భార్య ఉడుకుమోత్తనాన్ని స్పోర్టివ్‌గా తీసుకుంటూ,స్కూటర్‌ను ముందుకు కదిలించాడు రాజారామ్, "నన్ను జాగ్రత్తగా పట్టుకో! నీకేమైనా జరిగితే ఈ వయసులో నాకు పిల్లనిచ్చేవాళ్లెవరు?" అని జోకుతూ

'మీ మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు! ఎంతకూ చిన్నిల్లు సెటప్ మీదే వుంటుంది మనసు—అది వీలు కాకున్నా ఇలా మాటలతోనైనా సంతృప్తిపడ్డం.. అలా చేస్తే నేనా తేల్గిగ్గా వదిలిపెట్టేది. చచ్చి దయ్యాన్నయ్యైనా పీడించనా...?'

రాజేశ్వరి భర్తను కోపగించుకుంటున్నట్లుగా మాట్లాడిందే కాని, అతని నడుం చుట్టూ చెయ్యేయడం మాత్రం ఆప్యాయంగానే వేసింది.

మధ్య దార్లో ఐస్ క్రీమ్ పార్లర్ దగ్గర స్కూటరాపాడు భర్త. 'ఎటూ మీ ఫ్రెండ్ మేరేజ్ ఫంక్షన్‌కేనా మనం వెళుతుంట.. అక్కడ ఇలాంటివి పెట్టకపోతారా? ఇక్కడెందుకు వృథా ఖర్చు?" సణుగుతూనే అతనితో పార్లర్‌లోకి ప్రవేశించింది రాజేశ్వరి.

'ఐస్ క్రీమంటే నీకిష్టం కదా! అక్కడ సప్లై వున్నా ఈ తృప్తి వేరే రాజీ! మన ఒంటరి సామ్రాజ్యం, ప్రేమవిహారణలో భాగం ఇది...'

'ష్! మెల్లగా మాట్లాడండి. ఎవరైనా వింటే బాగోదు....' అతన్ని వారించింది.

'నా పెళ్లాం, నా ఇష్టం! మన మాటలు వినలేనంతగా వుంటే చెవులు మూసుకొంటారు. ఐ డోంట్ కేర్ ఎనీ బడీ'.

ఆర్డర్ చేసిన ఐస్ క్రీమ్ అప్పుడే టేబుల్‌పై వుంచి పక్కకు తప్పుకొన్నాడు బేరర్.

అటూ ఇటూ చూసి, ఎవరూ తమను పట్టించుకోవటం లేదని నిర్ధారించుకొన్నాక, ఇంత ఐస్ క్రీమ్ తీసి భర్త నోట్లో కుక్కింది రాజేశ్వరి, 'మీ వాచాలతకిదే సత్కారం!' అన్నట్లుగా ముసిముసిగా నవ్వుతూ.

అతనేదో చెప్పాలని నోరుబోయినా భార్య నోట కుక్కిన ఐస్‌క్రీమ్ సాంతం మాట్లాడను వీలు గలగనిస్తేనా? అయినా పంతంగా—

'ఊ! ఆ... ఆ ఊ' అని అస్పష్టంగానైనా మాట్లాడబోతుంటే బ్రహ్మాస్త్రం వదిలింది సతీమణి చేసైగలతో. దానర్థం 'ఇలాగైతే రాత్రికి బెడ్‌పై ఎలాకు సహకరించను...'

మగవాడికి అంత కన్నా స్పీడ్ బ్రేకర్ ఏముంది? మానవుడు అటుపై నోరెత్తితే ఒట్టు.

000

'ఏరా వెధవాయ్! నాన్నారూ, నేనూ రోడ్లో వుంటే మా పేర్లు పెట్టి పిలుస్తార్రా? అదేదీ, ఇల్లు పీకి పిందిరేసే గడుగ్గాయ్! దానిపనీ పడతాను...'

భర్త ఫ్రెండ్ ఇంట్లో మ్యారేజ్ ఫంక్షన్ చూసుకొని తీరిగ్గా తమ ఇంట్లోకి అడుగు పెడుతునే విజృంభిస్తున్న భార్య నోరు మూశాడు రాజారామ్. 'ష్! నిద్రపోతున్నట్లున్నారు పిల్లలు. నీ అరుపులతో వాళ్ల నిద్ర డిస్టర్బ్ చేయకు. కావాల్సింటే రేపొద్దున కేకలేద్దువుగాని. భోజనం చేశారో లేదో బిడ్డలు! ఒట్టి అల్లరి పిడుగులు.'

తల్లికే బిడ్డలపై అక్కర అంటారు! కానీ ఇలాంటి తండ్రులూ వున్నారు మురిసిపోయింది రాజేశ్వరి.

ఇదంతా తండ్రి నవ్వుతూ చూస్తున్నాడు. అతన్ని చూస్తూ ధైర్యం తెచ్చుకున్న సాధన, 'తమ్ముడు చెప్పింది నిజమే కదా డాడీ! మా స్కూల్లో మేమంతా టీచర్, మేడమ్ అని పంతుళ్లు, పంతులమ్మలను పిలిస్తే, మా హెడ్మాస్టర్ సారేమో 'హల్లో గిరీ! ఏమండీ రోజా' అని వాళ్లను పిలుస్తూంటాడు. ఎలా పిలిచినా పంతుళ్లూ, పంతులమ్మలూ మారరు కదా!'

గోడ గడియారం అప్పుడే పదకొండు గంటలు కొట్టింది. తల్లిదండ్రులు ఇంట్లో అడుగుపెట్టే ముందు వరకు కబుర్లాడుకొంటున్నారు పిల్లలు. తీరా లోనికి అడుగుపెట్టిన తల్లి అరుపులకు బెదిరిపోయి, దుప్పట్లోనే అక్కాతమ్ముళ్లు ఇలా గుసగుసలాడుకున్నారు.

'చూడు! అమ్మ ఎలా అరుస్తుందో? నాన్నారే మంచివారు. మనం ఇప్పుడిప్పుడే పెద్దవుతున్నామా? వయసొచ్చే పిల్లలతో తల్లిదండ్రులు ఫ్రెండ్స్‌లా మసలాలని మన స్కూల్లో టీచర్ చెప్పాడా?

అయినా అక్కా! అమ్మానాన్నలను పేర్లు పెట్టి పిలిస్తే తప్పేంటంట?'

ఆవేశం పాలు ఎక్కువయింది గోపి తగ్గు స్థాయి స్వరంలో కూడా.

'ష్! కొంపముంచుతున్నావురా, నువ్వు! ఈ విషయం రేపు స్కూల్లో మన టీచర్‌నే అడుగుదాం కానీ, ఇప్పటికి నోర్మూసుకుపడుకో' అంటూ సాధన తమ్ముడి నోరు మూసింది, వాడింకేం మాట్లాడకుండా.

000



రాజేశ్వరి అంచనా వమ్ము కాలేదు. వీధి కొళాయి దగ్గర మంచినీళ్లకని తను వెళ్లడమే తడవు, ఎదురింటి కృష్ణవేణి, 'ఏంటొదినా! నిన్న ఆదివారం మా అన్నయ్యా, నువ్వూ స్కూటర్లో ఎక్కడికో ప్రయాణం చేశారే.. బహుశా సినిమా ప్రోగ్రామా?'

తుఫాన్ ముందు ప్రశాంతత ప్రదర్శించింది.

'ఊ, కానీ మహాతల్లీ! ఈ పరామర్శ చాలదులే నీకు? నా పిల్లల ధోరణిని ఎద్దేవా చేయడానికేగా ఈ నాంది.. అప్పటికి నీ పిల్లలు, భర్తా చక్కని నడవడిక కలిగినవారన్నట్లు, మా ఇల్లే అపభ్రంశం పాలన్నట్లు చురకలు... నీలాంటి ఆడవారుండబట్టే మన స్త్రీజాతి మొత్తం నోటి మనుషులకి చెడ్డ పేరు..' ఈ స్వగతంతో పైకి మాత్రం నవ్వు ముఖం పెట్టింది రాజేశ్వరి. 'అయినా నేననకూడదు కానీ వదినా! మీ పిల్లలేంటమ్మా మరీ అలా..?'

ఆమె మాట పూర్తి కాకముందే ఒళ్లు చర్రున మండింది రాజేశ్వరికి. 'మా ఆయన్నీ... అదే మీ అన్నయ్యనూ, నన్నూ వాళ్లు పేర్లు పెట్టి పిలిచారనే కదూ నీ బాధంతా? రోజులెలా వున్నాయి వదినా! పిల్లల కా మాత్రం స్వాతంత్ర్యం ఇవ్వకుంటే వాళ్లు జడుల్లా మారిపోతారు. ఇంట గెలిచి రెచ్చ గెలవమన్నారు ఇందుకే. ఆఫ్టరాల్, వాళ్ల అమ్మానాన్నల్నే కదా పేర్లు పెట్టి పిలిచింది? బయటివాళ్లను ఎంచక్కా అంకుల్, ఆంటీలనేగా పిలుస్తారు! ఇంకేటమ్మానీ అభ్యక్షనూ...? అహ్హా... నాకు తెలియక అడుగుతున్నానూ... మీ వారు, అదే మా అన్నయ్యను నువ్వూ అడపాదడపా 'డాళింగ్!' అనడం విన్నట్లుగా గుర్తు. మనలాంటి సంసారస్త్రీలు భర్తను 'ఏమండోయ్!' అనడమే మేలు గానీ సీమదొరల్లా డాళింగ్‌లు, లవ్ బాయ్ పిలుపులేంటంట...?'

తన సుత్తి వేయబోతే ఈ రాజేశ్వరి ఎదురు సుత్తి ఏమిట్రా బాబోయ్? ఠారెత్తుకున్నది కృష్ణవేణికి.

ఆమె నవ్వుతూనే తనను చావు దెబ్బ కొడుతూందని, ఆ ధాటిని తట్టుకోలేక మూతి మూడు వంకరలు తిప్పుతూ 'ఊ! ఉన్న మాటంటే ఉలుకనీ.. నాకెందుకొచ్చిన తంటాలే ఇదంతా! మీ పిల్లలు... మంచీ, చెడ్డా మీకే సొంతం. చూసేవాళ్లమే కానీ ఆర్చేవారమూ, తీర్చేవారమూ మేము...' ఈ విధంగా లోలోనే సణుక్కుంటూ, పక్కనున్న మరొకావిడతో ఏదో పనున్నట్లుగా 'ఏమక్కా?' అంటూ అటు మళ్లింది.

'కుదిరిందా నీ తిక్క?' సన్నగా నవ్వుకుంటూ తన పనిలో పడింది రాజేశ్వరి.

ఉదయాన్నే పిల్లలను చీవాట్లేస్తుంటే 'ఊర్కో రాజీ! పొద్దున్నే వాళ్ల మూడ్ పాడు చేయకు. స్కూలు, ట్యూషన్, హోమ్‌వర్క్ ఎంతని గెటాన్ కాగలరు?? అంటూ భర్తవాళ్లను వెనకేసుకొస్తున్నా సరే—

తను వేసిన చివాట్లన్నీ ఓపిగ్గా భరించి చివర్న ఒక్క మాటన్నాడు గోపి.

''అమ్మ అంటే ఇంగ్లీష్‌లో మమ్మీ! నాన్నను డాడీ అంటారా? మనం రోజూ ఒకే కూరను చేసుకొని తినలేనట్లే ఒక రోజు మమ్మీ, డాడీ-నిన్నలా మీ అసలు పేర్లు పిలుస్తూ... ఏమక్కా! నేను చెప్పింది రాంగా?'

ఇదంతా తండ్రి నవ్వుతూ చూస్తున్నాడు. అతన్ని చూస్తూ ధైర్యం తెచ్చుకున్న సాధన, 'తమ్ముడు చెప్పింది నిజమే కదా డాడీ! మా స్కూల్లో మేమంతా టీచర్, మేడమ్ అని పంతుళ్లు, పంతులమ్మలను పిలిస్తే, మా హెడ్మాస్టర్ సారేమో 'హల్లో గిరీ! ఏమండీ రోజా' అని వాళ్లను పిలుస్తూంటాడు. ఎలా పిలిచినా పంతుళ్లూ, పంతులమ్మలూ మారరు కదా!'

'మీకు చిన్నప్పుడు ఎక్కువగా వస పోశానే! దాని ఫలితమే ఇది.. సర్లే! ఇంట్లో మీ ఇష్టం వచ్చినట్లుగానే పిలవండి! బయట జనం వినేప్పుడు మాత్రం అమ్మానాన్నలనో, ఇంగ్లీష్ మమ్మీడాడీలనో పిలవండి...' వాళ్ల ముచ్చటైన రీజనింగ్‌తో తనకు నవ్వొస్తున్నా, అంతదాకా కరుగ్గా వున్న ధోరణిని మార్చుకోను ఇష్టపడనట్లు సీరియస్‌గానే ముఖం పెట్టింది.

భర్త వంకకు మాత్రం ప్రసన్నంగా చూస్తూ, బిందె నిండా మంచి నీళ్లు పట్టుకొని ఇంటిదారి పడుతూ ఆ సంఘటనను గుర్తుకు తెచ్చుకొని, 'ఏమిటో... కాలమహత్యం! వస్తువులన్నీ కల్తీలమయమే! పెద్దమనుషులూ స్వార్థపరులైపోతున్నారు. ఇక పిల్లలూ ఇలా పిలుపుల్లో అడ్డదారులు తొక్కుతున్నారంటే ఆశ్చర్యమేముంది— కలికాలం! ఎండావానలు, చలీ, వేడీ తారుమారుగా వుంటున్నాయంటే ఇదే మరి!' దీర్ఘంగా నిట్టూర్చింది రాజేశ్వరి.